దేముడు

"నువ్వునా వెంట రా(డయివర్. నేను సాంజ్ఞ చేస్తే తప్ప నా ఐడెంటిటీ ఎవరికీ చెప్పవద్దు" (డయివర్‌ని ఆదేశించి జిల్లా కలెక్టర్ జిల్లా హెడ్ క్వార్టర్స్ హాస్పెటల్‌లోకి అడుగుబెట్టింది.

ఆమె ఆ జిల్లాకు బదిలీ అయివచ్చి యింకా నెల నిండలేదు.

వచ్చీరాగానే జిల్లా హెడ్ క్వార్టర్స్ హాస్పెటల్ లో జరుగుతున్న దారుణాలను గురించిన పిటీషన్లను అందుకొంది. ఎప్పుడో సర్‌(పయిజ్ విజిట్ చేద్దామనుకొంటుండగా యీ అవసరం వచ్చింది.

నిన్న మధ్యాహ్నం ఆర్టీసీ బస్సుకు ఘోర (ప్రమాదం జరిగింది. అయిదుగురు అక్కడికక్కడనే మరణించారు. మరెందరికో గాయాలు తగిలి హాస్పెటల్ లో వున్నారు.

(ప్రమాదం జరిగిన సమయంలో జిల్లా కలెక్టర్ హైదరాబాద్‌లో అఫీషియల్ డ్యూటీ మీద వుంది. వార్త తెలియగానే బయలుదేరి వచ్చింది. రాగానే హాస్పెటల్ సూపరింటెండెంట్ గారికి ఫోను చేసింది. నో రెస్పాన్స్.

దాంతో ఆమె నేరుగా హాస్పెటల్ సూపరింటెండెంట్ గది వద్ద కెళ్ళింది.

ఆయన గదిలో లేరు. ఆయన గది ముందు కుర్చీలో సిగరెట్ తాగుతూ ప్యూను వున్నాడు. సూపరింటెండెంట్ గారిని గురించిన (ప్రశ్నలడిగిందామె. ప్యూను చాలా రెక్‌లెస్‌గా, మొరటుగా సమాధానాలిచ్చాడు.

"సూపరింటెండెంట్ గారితో నీ కెందుకమ్మా. నీక్కావల్సిన పనేమిటో చెప్పు. చెల్లించాల్సిన "మం(త్రపుష్పం" చెల్లించు. నీ పని అయిపోతుంది. "మం(త్రపుష్పం" నా కనుకొనేరు. సూపరింటెండెంట్ గారికే చేరుతుంది."

ఆమె అక్కడినుంచి బస్సు (ప్రమాదం పేషెంట్స్ వున్న వార్డుకు వెళ్లింది. మూలుగులు.... ఏడుపులు.... అరుపులు.... రోదనలు.... ఆ పేషెంట్స్ అతీగతీ పట్టించుకొనే నాధుడు లేడక్కడ.

వార్డంతా గలీజుగా వుంది. శు(భత ఎక్కడా కన్పించలేదు.

ఆమె వార్డులోకి వెళ్లబోతుంటే సైంధవుడిలా వో తోటీ అడ్డం పడ్డాడు. వాడిని తప్పించుకొని పేషెంట్స్ దగ్గరి కెళ్ళింది.

"డాక్టర్ నేనీ బాధ భరించలేను. నా కింత విషమిచ్చి చంపెయ్యండి. ప్లీజ్. డాక్టర్.... సిస్టర్...." హాస్పెటల్ అదిరిపోయేలా వో పదహారేళ్ల అమ్మాయి రోదిస్తోంది. ఆ అమ్మాయి పేరు జయంతి.

కలెక్టర్ ఆ అమ్మాయి వద్ద కెళ్లి వోదార్చింది. ట్రీట్‌మెంట్ వివరాలు అడుగుతోంది.

''ఎవరమ్మా నువ్వు. పర్మిషన్ లేకుండా పేషెంట్స్ దగ్గరి కెళ్లటమేనా? యిదేం ధర్మసత్ర మనుకున్నావా? బయటి కెళ్లు ముందు. డాక్టర్ గారు వస్తున్నారు'' వొక సిస్టర్ రాక్షసిలా అరుస్తూ వచ్చింది. మరి కాస్సేపట్లో డాక్టర్ కూడా వచ్చాడు.

''ఏయ్ అమ్మాయ్! ఎందుకలా రంకె లేస్తావు? ఆర్టీసీ బస్సెక్కి నువ్వు కాళ్లు చేతులు విరగ్గొట్టుకొని వస్తే నేనేం చెయ్యను? బంకపోసి అతకటానికి అదేం కాగితమా? నోరు మూసుకో'' కరుకుగా అన్నాడు డాక్టర్.

''నా కింత విష మిచ్చి చంపెయ్యండి డాక్టర్! ప్లీజ్... ''

''మేం చంపట మెందుకు? నువ్వే చస్తావు. కాస్త వోపికపట్టు.''

ఎంత అమానుషం? కలెక్టర్ కళ్ల ముందు ఏవో దృశ్యాలు....

★——★——★

రైలు ఏదో స్టేషన్‌లో ఆగింది.

''ఇంటర్ పరీక్ష ఫలితాలు'' పేపర్ వాళ్లు అరుస్తుంటే హరిణి లేచి పేపరును కొని ఆత్రంగా చూచింది. ఫస్ట్‌క్లాస్.... శకండ్ క్లాస్.... కనీసం ఆర్డినరీ పాస్ లిస్ట్‌లో కూడా ఆమె నెంబరు లేదు.

హైదరాబాద్‌లో వున్న మేనమామ గారింటికి శలవుల కెళ్లి యింటికి తిరిగి వస్తున్నదామె. తనకు ఫస్ట్ క్లాస్ వస్తుందని తనే కాదు- కాలేజీలో లెక్చరర్లు, స్నేహితురాళ్లు, తలిదండ్రులు అంతా అనుకొన్నదే.

యిప్పుడు వారందరికీ మొహం ఎలా చూపించాలి?

''ఏమ్మా! పరీక్ష ఫెయిలు అయ్యావా? దిగులు పడకు. సెప్టెంబర్‌కు బాగా చదువు'' పక్క సీటు ఆమె సానుభూతి ప్రకటించింది.

అంటే ఫెయిల్ కళ తన మొహంలోనే కన్పిస్తున్నదన్నమాట!

ఆమె పేపరంతా మరోసారి గాలించి చూచింది. ఊహూ...

పేపర్ని విసిరి పారేసింది-కిటికీలో గుండా.

రైలు పక్క స్టేషన్‌లో ఆగగానే దిగింది. ఆమె దిగాల్సిన స్టేషన్ యింక గంటకు కాని రాదు.

ప్లాట్‌ఫారమ్ చివరిదాకా నడిచి అక్కడి నుంచి రైలు పట్టాల మధ్య నడవ సాగింది. నడుస్తూ నిర్ణయానికి వచ్చింది.

నో. పరీక్ష ఫెయిలయిన తన మొహన్ని అందరికీ చూపలేదు. ఆ అవమానాల్ని భరించలేదు.

ఎదురుగ్గా రైలు రావటం ఆమె గుర్తించింది. అయినా ఆమె అలా మధ్యగా నడుస్తూనే

వుంది.

రైలు మరీ దగ్గరికి వస్తుంటే భయపడటం మాత్రం ఆమెకు గుర్తుంది. ఆ తర్వాత మళ్ళీ కళ్లు తెర్చేసరికి హాస్పటల్‌లో మంచం మీద వుంది.

శరీర మంతా ఎవరో కొరికేస్తున్నట్లు, బల్లేలతో పొడుస్తున్నట్లు బాధ-

"అమ్మా.... అబ్బా.... నేనీ బాధ భరించ లేను. సిస్టర్, నన్నెందుకు బతికించారు? చంపెయ్యండి. సిస్టర్...." జరిగిందంతా గుర్తు చేసుకొంటూ అందామె రోదిస్తూ.

సిస్టర్ వెంటనే డాక్టర్‌కి కబురు చేసింది. హరిణి దగ్గర కూర్చొని అప్యాయంగా కబుర్లు చెప్పింది. యింతలో డాక్టర్ వచ్చాడు, నవ్వుతూ ప్రసన్నంగా వున్న అయన మొహాన్ని చూడగానే ఆమె మనస్సు కొంత శాంతించింది.

'చావటం ఎంత సేపమ్మా? క్షణం పట్టదు. బ్రతకటమే ప్రయోజకత్వం. నీకో శుభవార్త చెప్పనా? నువ్వు ఇంటర్ పాసయ్యావు. ఎలాగో తెల్సా? మామూలుగా కాదు. డిస్టింగ్‌షన్‌లో. టాప్‌రేంక్ వచ్చిన పది మందిలో నువ్వు కూడా వున్నావు. నీ రిజల్టు ప్రకటించటంలో పొరపాటు జరిగిందిట. మర్నాడు సరిదిద్దుకొని పేపర్లో ప్రత్యేకంగా బాక్స్ కట్టి వేసేరు. యిదిగో చూడు.'

ఆమె బాధ క్షణంలో మాయమయినట్లయింది.

వెంటనే లేచి వెళ్లి ఆ వార్తను తల్లితండ్రులతో, స్నేహితురాళ్లతో, లెక్చరర్లతో చెప్పాలన్నంత ఉత్సాహం వచ్చింది. మంచం మీది నుంచి లేవబోయింది. కానీ .... కానీ...

అప్పుడు గ్రహించిందామె - తన శరీర అంగాలకు లోపం ఏర్పడినట్లు.

"థాంక్యూ డాక్టర్ .... నా కిప్పుడు ఆనందంగావుంది. మంచం మీద నుంచి లేచి గంతు లేయాలని వుంది. నేను డిస్టింక్షన్‌తో పాసయ్యానని అందరికీ చెప్పాలని వుంది. మంచం మీద నుంచి నేను లేచేలా చెయ్యరాడాక్టర్ !ప్లీజ్ ...."

"అలాగేనమ్మా. నువ్వు లేచి గంతు లేసేలా చేస్తాను గదా? కానీ యిప్పుడా అవసరం లేదు. ఎందుకంటే నీ ఘన విజయం అందరికీ తెల్సు. నీ ఫాదర్, మదర్, ఫ్రెండ్సు, లెక్చరర్స్, యింకా ఎందరో ప్రముఖులు నీ దగ్గరికి వచ్చి చూచి వెళ్లారు తెల్సా?"

"అంటే.... ?"

"అవునమ్మా. నీకు ఏక్సిడెంటయి పది రోజులయింది. యీ పది రోజులుగా నువ్వు మృత్యువుతో పోరాడి జయించావు."

"నా కసలు దెబ్బ లెక్కడ తగిలేయి డాక్టర్. ఏమయింది?"

"ఏం కాలేదమ్మా. యూ విల్ బి ఆల్‌రైట్. మీ నాన్న గారు మరి కాస్సేపట్లో వస్తారు. అప్పటి దాకా విశ్రాంతిగా పడుకోమ్మా" అంటూ డాక్టర్ ఆమెకు యింజక్షన్ యిచ్చాడు.

ఆమె మగతగా నిద్రలోకి జారుకొంది.

★—★—★

"డాక్టర్ ! పేషెంట్స్‌తో మాట్లాడే విధానం అదేనా? హౌ క్రూయల్ యు ఆర్ ?" జిల్లా కలెక్టర్ అంది.

"షటప్. హు ఆర్ యు? ఐసే - హు ఆర్ యు టు టెల్ మి. గెటవుట్."

కలెక్టర్ డ్రయివర్ వైపు చూచింది.

"వారు యీ జిల్లా కలెక్టర్ గారు. ప్రమాదంలో చనిపోయిన వారిని, గాయాలు తగిలిన వారిని చూడటానికి వచ్చారు." డ్రయివర్ ప్రకటించాడు.

హాస్పిటల్ స్టాఫ్‌పైన పిడుగు పడ్డట్లయింది. ఒక్క క్షణం డాక్టర్, సిస్టర్ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. అంతలోనే కోలుకొన్నారు.

"సారీ మేడమ్. ప్లీజ్ ఎక్స్‌క్యూజ్ మి" సిస్టర్ ఆమె కాళ్లమీద పడింది.

వొక్క నిమిషంలో కలెక్టర్ విజిట్ విషయం హాస్పిటల్‌లో అందరికీ తెల్సింది. అంతా ఆ వార్డుకు పరుగులు మీద వచ్చారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ కోసం ఫోన్లు... ప్రత్యేక మెసెంజర్లు....

ఆయన పది నిముషాల్లో వచ్చారు. అపాలజీస్ చెప్పసాగేరు.

"దట్సాల్ రైట్ సర్. పాస్ట్ యీజ్ పాస్ట్. మీ స్టాఫ్‌నంతా వారి వారి డ్యూటీలకు వెళ్లమనండి ముందు. ప్రమాదంలో దెబ్బ తగిలిన వారిని నేను చూస్తాను. ముందు ఆ అమ్మాయి బాధ వుపశమించటానికి ఆ డాక్టర్‌ని తగు చర్య తీసుకోమనండి. ఆ అమ్మాయి బ్రతకాలి. ప్రయోజకురాలై తిరగాలి."

"యస్ మేడమ్. ప్రయత్నిస్తాము. మిగతా పేషెంట్స్‌ను చూడండి"

ఆమె దెబ్బలు తగిలిన వొక్కొక్క పేషెంట్‌ను పలకరించి ధైర్యం చెప్పసాగింది. వారి బాధలను కష్టాలను విన్నది.

దెబ్బలు తగిలిన వారందరికి అక్కడికక్కడే ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

"ఆఖరి పేషెంట్ యీయనే. కాళ్లకు బాగా దెబ్బలు తగిలేయి"

కళ్లు డేమేజ్ అయ్యాయి. చూపు కన్పించటం లేదు

ఆమె పేషెంట్‌ను చూచి ఉలిక్కిపడింది.

"కలెక్టరమ్మగారూ మా అమ్మాయిని బ్రతికించండి. కాళ్లు పోయినా ఫర్వాలేదు. చేతులు పోయినా ఫర్వాలేదు. ఒక్కగానొక్క కూతురు. ప్రాణాలతో మాకు దక్కితే చాలు" పదహారేళ్ల అమ్మాయి తాలూకు తల్లిదండ్రులు అప్పుడే వచ్చి మొరపెట్టుకున్నారు.

అసంకల్పితంగానే అమె కళ్లు పోయిన పేషెంట్ వైపు చూచింది.

చటుక్కున వో దృశ్యం -

★——★——★

"డాక్టర్."

అప్పుడే స్పృహ వచ్చిన హరిణి తండ్రి గొంతు విని ఆనందించింది.

"మొన్న వచ్చినప్పుడే మీతో వో విషయం చెప్పాలనుకొన్నాను. కానీ కుదరలేదు. యివాళ ఎవరూ లేరు కదా? హరిణి కూడా స్పృహలో లేదు. అందుకనీ..."

"చెప్పండి" డాక్టర్ శ్రీకృష్ణ అన్నాడు.

అంత రహస్యంగా తన తండ్రి డాక్టర్‌కి ఏం చెప్తాడో?

"హరిణిని ఎలాగైనా బతికించాలని మీరు పట్టుదలతో కృషి చేస్తున్నారు. ఎందుకు? మా అమ్మాయిని బ్రతికించమని మేము మిమ్మల్ని కోరేమా?"

"మీరు కోరటం ఎందుకు? డాక్టర్‌గా అది నా బాధ్యత."

"కానీ హరిణి చావాలనుకొని రైలు కింద పడింది. కాళ్లు రెండూ తీసెయ్యాలంటున్నారు. ఎడం చెయ్యి మణికట్టు తెగిపోయిందంటున్నారు. కుడి చేతి వేళ్లు కూడా తెగిపోయాయంటున్నారు. యింకా మీక్కూడా తెలియని అంగవైకల్యాలెన్ని వున్నాయో? ఆ మొండేన్ని తీసుకుపోయి మేమేం చెయ్యం డాక్టర్ గారూ? జీవచ్ఛవంలాంటి ఆ పిల్లను బ్రతికినంత కాలం నెత్తిన పెట్టుకొని మొయ్యాల్సిందే కదా? మాకంత శక్తి లేదు సర్. కనుక...."

వింటున్న హరిణి గుండెల్లో రైళ్లు పరిగెత్తి నట్లయింది. రెండు కాళ్లూ పోయాయా? తనకింక కుంటిబతుకేనా? ఆ బ్రతుకు బ్రతక్కపోతేనేం?

"కనుక?"

"కనుక... కనుక... హరిణిని బ్రతికించటానికి మీరనవసరంగా శ్రమ పడకండి. ఆ పిల్ల అదృష్టం ఎలా వుంటే..." ఆ మాటలన్నది తల్లి.

అంటే - తనని చంపమని కోరుతున్నారన్నమాట! ఎవరు? తనని స్వయానా కన్న తల్లి తండ్రులు! ఛీ... వీరేం తలిదండ్రులు?

ఆమెకా క్షణంలో తలిదండ్రులపైన అసహ్యం వేసింది. కచ్చ కలిగింది. ఎలాగైనా బతికి వారిని బాధించాలనిపించింది.

"మీ అభిప్రాయం నాకర్థమయింది. కానీ సారీ - మీ కోరిక తీర్చను. ఎందుకంటే - నేను ప్రాణం పొయ్యాల్సిన డాక్టర్ని. తలిదండ్రులుగా మీరు ఆ అనుబంధాన్ని మానవత్వాన్నే మర్చిపోయినా, నేను నా కర్తవ్యాన్ని విస్మరించను. యుకెన్ గో."

ఆ తర్వాత తలిదండ్రులు హరిణి వద్ద కొచ్చాడు. కానీ హరిణికి వాళ్ల మొహం చూడబుద్దేయ లేదు. కళ్లు తెరవలేదు.

"డాక్టర్. నేనంటే మీకెందుకింత ప్రేమ డాక్టర్" డాక్టర్ శ్రీకృష్ణ వచ్చినప్పుడు కన్నీళ్లు కారుస్తూ అంది హరిణి.

"బికాజ్...., యు ఆర్ ఎ నైస్ గాల్. యు ఆర్ ఎ క్లవర్ గాల్. వన్‌డే-యు విల్ బికమ్ ఎ గ్రేట్ పర్సన్. అప్పటికి నేను ముసలాడినయిపోతాను. యీ ముసలాడిని అప్పుడు ఎవరు ప్రేమిస్తారు? నువ్వు ప్రేమించి దగ్గరికి తీస్తావని! అందుకు?" సర్దాగా అన్నాడు శ్రీకృష్ణ

"యీ కుంటిదానికి, యీ జీవచ్ఛవానికి అంత అదృష్టం కూడా నా డాక్టర్?"

"అమ్మా హరిణీ..."

"మా అమ్మా నాన్నలతో మీ సంభాషణంతా విన్నాను డాక్టర్. తల్లిదండ్రులకే అక్కర్లేని యీ కుంటిదాన్ని ఎవరు చేరదీస్తారు డాక్టర్. దయచేసి నన్ను చంపెయ్యండి. కనీసం నా దోవన నన్ను చావనివ్వండి"

"నో. నిన్ను బ్రతికిస్తానమ్మా. ఎందుకంటే సృష్టిలోని ప్రతి ప్రాణి ఎంతో విలువైనది. కనుక చావాలని ఏ ప్రాణి కోరుకోదు కనుక."

"కానీ..."

"నీ అంగ వైకల్యం నీ అభివృద్ధికి ఆటంకం కాదమ్మా. నన్ను నమ్ము. చావటం గొప్ప కాదమ్మా. బ్రతికి ఏదన్నా సాధించటం గొప్ప."

★——★——★

"కలెక్టర్‌గారూ, నన్నెందుకు బ్రతికించారు? నాకు మీ మీద చాలా కోపంగా వుంది" ఫోనులో ఉక్రోషంగా అంటోంది జయంతి.

"మళ్లీ ఏమయిందమ్మా? విన్నెవరైనా ఎగతాళి చేశారా?"

"వొకరు కాదు కలెక్టర్‌గారూ. అంతా ఎగతాళి చేస్తున్నారు. పూర్వం మొహం ఎదుటే చేసేవారు. యిప్పుడు మీకు భయపడి చాటుగా హేళన చేస్తున్నారు. అయినా నేను బ్రతికేం లాభం? యీ అవిటిది అందరికీ బరువేకదా?"

"సరిగ్గా యీ మాటలే అందమ్మా హరిణి కూడా వొకప్పుడు."

"హరిణి ఎవరు?"

"నేను వచ్చి చెప్తానమ్మా. మరో పది నిమిషాల్లో హాస్పిటల్‌కి వస్తాను. నేను వస్తున్నట్లు ఎవరికీ చెప్పవద్దు ఏం?"

జిల్లా కలెక్టర్ తీసుకొన్న శ్రద్ధవల్ల, బస్సు ప్రమాదంలో బలమైన గాయాలు తగిలిన వాళ్లంతా కోలుకొని హాస్పిటల్ నుంచి డిస్చార్జి అయిపోయారు.

జయంతి, కళ్లకు బలమయిన దెబ్బలు తగిలిన ముసలాయాన, మాత్రం మిగిలేరు.

జయంతి రెండు కాళ్లనూ మోకాలుదాకా తీసేసారు. ఒక చెవి తెగిపోయింది. ముక్కుకు బాగా దెబ్బలు తగిలేయి.

ఆ అమ్మాయి బెడ్ దగ్గర వొక ఫోనును ఏర్పాటు చేయించింది కలెక్టర్. ఆ ఫోనులో తనతో ఎప్పుడన్నా మాట్లాడవచ్చునని చెప్పింది. తను రోజూ మాట్లాడుతూ జయంతికి ధైర్యాన్ని,

పట్టుదలని ఇంజెక్ట్ చేయటానికి ప్రయత్నిస్తోంది.

"ప్లాస్టిక్ సర్జరీ చేయించి నీ మొహానికొచ్చిన అవిటితనాన్ని పోగొట్టానమ్మా. నువ్వు ఎవరి సహాయం లేకుండా నడిచేలా చేస్తాను".

ఆ ఏర్పాట్లు చూడమని కలెక్టర్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌ను కోరింది. కానీ అతను యిదిగో, అదిగో అంటూ కాలక్షేపం చేస్తున్నాడు.

"యివాళ ఆ ముసలాయన్ని డిస్చార్జ్ చేద్దామనుకొంటున్నాం. కానీ ఆయని వెళ్లనని మొండికేస్తున్నాడు" సూపరింటెండెంట్ కలెక్టర్‌ని చూడగానే చెప్పేడు.

"జయంతి సంగతేం చేసేరు? ఆ అమ్మాయి హాస్పిటల్ నుంచి నార్మల్‌గా నడిచి వెళ్లాలని చెప్పేను కదా?"

"ఇంపాజిబుల్. నేను చాలా మంది ఆర్థోపీడీషియన్స్‌ను కన్‌సల్ట్ చేసేను. మా హాస్పిటల్‌లో మేము చేయగలిగిందంతా చేసేము. ఇంక మా వల్ల ఏం కాదు. మీరు అనుకొంటున్న విధంగా ఆ అమ్మాయి కావాలంటే, అమెరికాకు పంపించాల్సిందే-"

కలెక్టర్ నవ్వింది.

"అంటే- అమెరికా మీద నున్నంత విశ్వాసం వొక సీనియర్ డాక్టర్‌గా మీకు మీ మీద మీ స్టాఫ్ మీద లేదన్న మాట! ఆల్ రైట్. ఆ అమ్మాయిని చూద్దాం పదండి".

★——★——★

"మిమ్మల్ని యివాళ హాస్పిటల్ నుండి డిస్చార్జ్ చేస్తున్నామండీ. కలెక్టర్‌గారు కూడా అంగీకరించారు. మీరు తయారుగా వుండండి."

"కలెక్టర్‌గారు అంగీకరించారా? అయితే యీ గుడ్డి ముసలాడికి దిక్కెవరు?"

"మీ కెవరూ లేరా?" కలెక్టర్ అడిగిందా ముసలాయన్ని.

"ఉండేవారే. కానీ నా పాపమే నన్ను అన్యాయం చేసింది. అందర్నీ పోగొట్టుకున్నాను. ఆఖరికి కళ్లు కూడా పోయాయి. నా పాపానికి యింకా ప్రాయశ్చిత్తం కాలేదని కాబోలు నన్ను మాత్రం ఆ భగవంతుడు తీసుకుపోవడంలేదు."

"మీ పశ్చాత్తాపమే మీకు రక్షగా నిలబడవచ్చుగా? భయపడకండి".

కలెక్టర్ ముసలాయనకు ధైర్యం చెప్పి జయంతి దగ్గరికెళ్లింది.

"హరిణి ఎవ్వరు మేడమ్? నాలాంటి దురదృష్టవంతురాలేనా?"

'నీకన్నా దురదృష్టవంతురాలమ్మా. ఎందుకంటే అవిటిదానివైనా నిన్ను ప్రేమించే తల్లిదండ్రులున్నారు నీకు. కానీ హరిణి తల్లిదండ్రులు అవిటిదైన కూతురు చనిపోతే బాగుంటుందని కోరుకొన్నారమ్మా. కానీ వారి అభ్యర్థనను వినకుండా డాక్టర్ ఆమెను బ్రతికించాడు. తలిదండ్రులు ఆమెను వదిలేసిపొయ్యారు. తల్లిదండ్రులకి కూడా అక్కర్లేని తనను బ్రతికించినందుకు హరిణి డాక్టర్‌ని కూడా తిట్టింది. కానీ ఆ డాక్టర్ దేముడిలాంటివాడమ్మా. అలాంటి డాక్టర్ చేతిలో

పడట మొక్కటే ఆమె అదృష్టం. ఆయన పేరు శ్రీకృష్ణ. ఆయన ఆమెలోని నైరాశ్యాన్ని పోగొట్టేడు. బ్రతుకుపట్ల తీపిని కలిగించాడు. జీవితానికి వొక ఆదర్శాన్ని, ఆశను కల్పించాడు. ఆమెను అందరిలా నడిచేలా చేసేడు. తను అవిటి దన్న భావనే ఆమెలో లేకుండా చేసేడు.'

'అంటే ఆమె తన కాళ్ల మీద నడిచేలా చేసేడా?'

'కాదు. పరుగెత్తేలా చేసేడు'

కలెక్టరు చెప్తున్న కథను హాస్పిటల్ స్టాఫ్ మాత్రమే కాకుండా ఆ వార్డులో పేషెంట్స్ అంతా శ్రద్ధగా వింటున్నారు.

'ఆమె చదువుకొంది. పెద్ద ఉద్యోగం చేస్తున్నది. తను అవిటిదానినని ఆమె ఎప్పుడూ అనుకోదు. నువ్వు అలా కావాలి. అలా నిన్ను తయారు చేయగల సమర్థుడు డాక్టర్ శ్రీకృష్ణ గారు మాత్రమే. ఆయన దగ్గరికి నిన్ను పంపిస్తాను. వెళ్తావుకదూ?''

'వెళ్తాను మేడమ్. కానీ వెళ్లే ముందు ఆ హరిణిని వొకసారి చూడాలనివుంది నాకు.'

'బట్ - మిస్ కలెక్టర్. ఎక్స్‌క్యూజ్ మీ. మీరు చెప్పిందంతా మెడికల్ ఫిక్షన్ అనుకొంటాను. బికాజ్ యిటీజ్ ఇంపాజిబుల్. జయంతిలో లేనిపోని ఆశలు కల్పించటం డిజైరబుల్ కాదనుకొంటాను.' సూపరింటెండెంట్ అన్నాడు.

కలెక్టర్ నవ్వింది.

'ఇంపాజిబుల్! నో డాక్టర్. యిటీజ్ పాజిబుల్. వేర్ దేర్ యీజ్ విల్ దేర్ యీజ్ ఎవే. నేను చెప్పింది కథ కాదు. వాస్తవం. యిలా చూడండి' కలెక్టర్ మెల్లగా చీర కుచ్చెళ్లు తొలగించి తన కాళ్లను చూపసాగింది.

అంతా ఆమెనే చూస్తున్నారు.

'అంటే... అంటే.... మీరు... మీరు... మీరేనా హరిణి?' జయంతి ఆనందం పట్టలేక కలెక్టర్‌ని కౌగిలించుకొంది.

యింతలో ఎవరో కింద పడ్డ శబ్ద మవుతే అంతా అటు చూశారు.

కళ్లు పోయిన ముసలాయన! బెడ్ మీద నుంచి లేచి వెళ్తూ దేనినో తట్టుకుని కిందపడ్డాడు. అంతలోనే కింద నుంచి లేచి పరుగెత్తసాగేడు.

'నాన్నా, మళ్లీ నీ కూతుర్ని వదిలేసి పారిపోవటం నీకు న్యాయమా నాన్నా. ప్లీజ్. నా కోసం ఆగు' ఆమె వెళ్లి అతని చెయ్యిపట్టుకొని ఆపింది.

'క్షమార్హుడినికాని నన్ను క్షమిస్తున్నావామ్మా?''

'నాకు రెండోసారి ప్రాణం పోసిన దేముడు నాకు నేర్పిన మొదటి పాఠం అదే నాన్నా!' హరిణి తండ్రి చేయి పట్టుకొని మెల్లగా నడిపించసాగింది.

ఆంధ్రసచిత్ర వారపత్రిక — 12.8.88 - 19.8.88